క్లుప్తంగా

నాగులదేవునిపాడులో దివ్యపూజాబలి


దివ్యపూజాబలి అర్పిస్తున్న ఫాదర్ మ్యారో

దెందులూరు: సమస్యల పరిష్కారం, ఆధ్యాత్మిక అభివృద్ధి దేవుని నమ్మికతోనే సాధ్య పడుతుందని అమెరికాకు చెందిన ఆర్‌సీఎం ఫాదర్ మ్యారో అన్నారు. ఆదివారం నాగులదేవునిపాడులో చర్చి ఫాదర్ ఇంటి జేవియర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్య పూజాబలి అర్పించారు. ఫాదర్ మ్యారో ప్రసంగాన్ని ఇంటి జేవియర్ తెలుగులో సంగస్తులకు అనువదించారు. సంఘ పెద్దలు, సంఘస్తులు, ఉపదేశీయులు మల్లిక్, విక్టర్ జాన్ దాసు ఉన్నారు. అనంతరం ఫాదర్ మ్యారోను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన ఇద్దరు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ.2,00,032 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా పర్వతనేని వెంకట సుబ్బారావు రూ.1,00,016, గరిమెళ్ల నిహిత్ రూ.1,00,016 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబాలకు ఆలయ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాలను అందించారు.

మన్యం బంద్‌ను జయప్రదం చేయండి

వేలేరుపాడు: ఈనెల 11, 12 తేదీల్లో తలపెట్టిన 48 గంటల నిరవధిక రాష్ట్ర మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ, గిరిజన ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో వేలేరుపాడు మండలం పూచిరెలా గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మడకం ఏసుబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కారం ధారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు విశాఖలో జరిగిన పర్యాటక అభివృద్ధి సదస్సులో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం అడ్డుగా ఉన్నాయని వ్యాఖ్యానించడం దారుణం అన్నారు. అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, గిరిజన ప్రజానీకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు, నాయకులు కారం వెంకట్రావు, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు కట్టం వెంకటేశ్వర్లు, కంగాల గంగరాజు, మడకం సునీత, రజిని ఉన్నారు.

100 మందికి వైద్యసేవలు

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సరస్వతి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ అక్కెం నరేష్ ఆధ్వర్యంలో వైద్యులు రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరంలో 100 రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), మధ్యాహ్నపు బలరాం, పీఎన్ఆర్ నాగేశ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

టి.నరసాపురం: వివాహిత ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు. బొర్రంపాలెంకు చెందిన సకలాబత్తుల శ్రీను, ఉషారాణిలకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల శ్రీను తనను అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని, దీనికి అతని కుటుంబసభ్యులు సహకరిస్తున్నారని ఉషారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

సుజుకి యాక్సెస్ వాహనం విడుదల


సుజుకి యాక్సెస్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సుజుకి యాక్సెస్ వాహనాన్ని పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఏలూరు మార్కెట్‌లోకి విడుదల చేశారు. స్థానిక హోటల్ ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ వాహనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్ఎంఆర్ పెదబాబు, రెడ్డి అప్పలనాయుడు, శ్రీకృష్ణ సుజుకీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే.. విజయం ఖాయం

- మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులు ఒత్తిడి జయించేలా విద్యాశాఖ చర్యలు
- ప్రతి పరీక్షకు ఒకరోజు విరామం


విద్యార్థులకు ఎంఈవో సూచలనందిస్తున్న దృశ్యం


విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

భీమడోలు: విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు మైలురాయి. మంచి కళాశాల సీటు సాధించాలన్న పదో తరగతి మార్కులే కీలకం. ఈ క్రమంలో పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతుంది. చదవడం ఒక ఎత్తయితే.. పరీక్షల్లో ఒత్తిడి లేకుండా చక్కగా రాయడం మరో ఎత్తు. దీంతో విద్యార్థులు ఒత్తిడిని జయించేలా విద్యా శాఖ ప్రత్యేక ప్రణాళికను చేపట్టింది. ప్రతి పరీక్షకు మధ్యన ఒక రోజు విరామం ఉండే విధంగా పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రూపొందించింది. దీని వల్ల విద్యార్థులు ఉపశమనం పొందుతారని తల్లిదండ్రులు అంటున్నారు. మార్చి 17వ తేదీ నుంచి నెలాఖరు వరకు పదో తరతి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ సారి ప్రతి పరీక్షకు ఒక రోజు విరామం ఉండే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రతి ఏటా జరిగే పరీక్షల్లో పండుగలు, వారాంతపు సెలవులు మినహా మిగిలిన రోజుల్లో పరీక్షలు జరిగేవి. వరసగా పరీక్షలు ఉండడంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. ఈ సారి ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఉంచారు. దీని వల్ల పాఠ్యాంశాల పునశ్చరణకు తగిన అవకాశం ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు.

గతంలో 11.. ప్రస్తుతం 7 పేపర్లు

పదో తరగతి పరీక్షల్లో ప్రస్తుతం ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు మాత్రమే ఉంటాయి. గతంలో 11 పేపర్లు ఉండేవి. సైన్సు మినహా మిగిలిన సబ్జెక్టులకు 100 మార్కులు ఉండేవి. భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రంలకు 50 మార్కులు చొప్పున రెండు రోజుల పరీక్షలు నిర్వహించేవారు. గతంలో ఒక పరీక్ష పూర్తి కాగానే మరో పరీక్ష రాయాల్సి ఉండేది. ఇప్పటికే ప్రభుత్వం విద్యార్థులు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకునేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది. ప్రస్తుతం పరీక్షల మధ్య ఒక రోజు విరామం ఇవ్వడంతో వీరిలో ఒత్తిడి దూరమై పరీక్షల ముందు రోజు పునశ్చరణ చేసుకుని పరీక్షలు బాగా రాసేందుకు వీలు కలుగుతుందని, తద్వారా ఉత్తీర్ణతా శాతం పెరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మండలాల వారీగా పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	జెడ్పీ ఉన్నత పాఠశాలలు	మొత్తం విద్యార్థులు
భీమడోలు	7	603
ఉంగుటూరు	10	638
నిడమర్రు	7	328
గణపవరం	7	510

నియోజకవర్గంలో 2,079 మంది టెన్త్ విద్యార్థులు

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలకు సంబంధించి పదో తరగతి విద్యార్థులు 2,079 మంది ఉన్నారు. విద్యార్థుల ఒత్తిడి బారిన పడకుండా ఉపాధ్యాయులు 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి వారికి ప్రత్యేక బోధన చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక గంట అదనంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ప్రత్యేక తర్ఫీదును అందిస్తున్నారు. విద్యార్థులను మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండేలా వారికి అవసరమైన విధంగా యోగా, ధ్యానం వంటి క్లాసులు నిర్వహిస్తున్నారు. కెరీర్ గైడెన్స్ క్లాసుల్లో టెన్త్ క్లాస్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కని పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. పరీక్షలకు వెళ్లే పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం ప్రధానమని వారికి సూచలందిస్తున్నారు.

విరామంతో ప్రయోజనం



పది పరీక్షల నిర్వహణలో ప్రతి పరీక్షకు ఒక రోజు విరామం ఇవ్వడంవల్ల విద్యార్థులు ఒత్తిడిని జయంచడానికి అవకాశం ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇంటికి చేరుకుని మరసటి రోజు పరీక్షలకు హడాహుడిగా వచ్చి పరీక్షలు రాయాల్సి వస్తుంది. దీనితో వారు తీవ్ర ఒత్తిడికి గురై పరీక్షలపై ఏకాగ్రతను సాధించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పరీక్షరాసే ముందురోజు సెలవువల్ల వారిలో భయం పోతుంది. దీనివల్ల ఉత్తీర్ణత పెరుగుతుంది.
– ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 1, భీమడోలు

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకి ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే జిలానీ

ఏలూరు (టూటౌన్): విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతను ఆర్టీసీకి ఇవ్వాలని, ప్రైవేటు వారికి ఇవ్వరాదని ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే జిలానీ డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ మేరకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కామ్రేడ్ జిలాని భాషా మాట్లాడుతూ విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకి ఇవ్వడం ద్వారా బలోపేతం చేయడానికి, తద్వారా ప్రజా రవాణా బలపడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఎరియర్స్ ఇవ్వాలని, 12వ పీఆర్సీ కమిటీ వేయాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, గతంలో ఆపిన ఎస్ఆర్బీఎస్ స్కీమును పునరుద్ధరించాలని, 30 సంవత్సరాలు పూర్తైన వారికి మూడు వేల రెండు వందలు ఎస్ఆర్బీఎస్ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ముసాయిదా నివేదికను, కర్తవ్యాలు ప్రవేశపెట్టారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఇ.శివకుమార్, రాజశేఖర్, రామయ్య, సత్యనారాయణ, అప్పడు, ఎం.అరుణకుమారి, టీపీఆర్ దొర పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా


పెదవేగి: కొండలరావుపాలెంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలను కలసిన కొఠారు అబ్బయ్యచౌదరి


దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో కొఠారు అబ్బయ్యచౌదరిని కలిసిన నాయకులు, కార్యకర్తలు


మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

పెదవేగి : దెందులూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొఠారు అబ్బయ్యచౌదరిని ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిశారు. ఎనిమిది నెలలుగా కూటమి ప్రభుత్వం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను ఆయనకు విన్నవించారు. అక్రమ కేసులు పెడుతున్నారని, 41 నోటీసులు ఇచ్చి వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సైతం పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఇది ఎంతో ఆవేదన కలిగిస్తోందని అన్నారు. గ్రామంలో ఎవరో తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని రాయితో కొడితే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారని ఎటువంటి ఆధారాలు లేకుండా వేధింపులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కార్యదర్శి స్టాలిన్, గ్రామ నాయకులు విజయ్, రాజేష్, రవి, విష్ణు కుమార్ జోజి శ్రీను వెంకటేష్ వివరించారు. దీనిపై అబ్బయ్యచౌదరి స్పందిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, పార్టీ పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట ప్రసాద్ బాబు, పార్టీ జిల్లా కార్యదర్శి మెట్లపల్లి సూరిబాబు, పెదవేగి సొసైటీ మాజీ అధ్యక్షుడు పెనుమాక సుబ్బారావు, లేగల శివ, పెదవేగి మండలంలో వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అబ్బాయి చౌదరిని కలిశారు.

బాధితులందరినీ పరామర్శిస్తా

దెందులూరు: నియోజకవర్గంలో కూటమి నేతల కారణంగా ఇబ్బందుల పాలైన బాధితులందరినీ కలిసి పరామర్శిస్తానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం కార్యాలయంలో ఆయన్ను దెందులూరు మండలంలోని వివిధ గ్రామాల చెందిన నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున కలిశారు. అబ్బయ్య చౌదరికి తాము పడిన ఇబ్బందులను, తమపై పెట్టిన అక్రమ కేసులను వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయ బోర్డు మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి కృష్ణ, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, గాలాయగూడెం సర్పంచ్ చిలక వెంకట సుబ్బారావు, పార్టీ నాయకులు అంబటి లక్ష్మణరావు, పెద్దిశెట్టి బసవయ్య, తోట అశోక్, జిల్లా కార్యదర్శి కట్ట ఏసుబాబు, చల్ల మేరీ రాజు, కొంగర రత్నకుమార్, మురళి, సానిగూడెం నుంచి ఫ్రాన్సిస్, గోపన్నపాలెం సర్పంచ్ కోటి నాగమల్లేశ్వరి, కామా కుమార్‌బాబు, జోగన్నపాలెం సొసైటీ మాజీ చైర్మన్ పాకలపాటి వాసు తదితరులు కలిశారు.

అచ్చమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ అమ్మవారు


పూజలందుకున్న శ్రీ భీమ నాగలింగేశ్వర స్వామి

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శర్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులకు అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ భీమ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామ కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ తోట అచ్చియ్య, తోట అశోక్ ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం


ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం నిర్వహిస్తున్న అమ్మవార్ల ఊరేగింపు

భీమడోలు: భీమడోలులోని గ్రామదేవతలు శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజుల జాతర మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అమ్మవార్ల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో గణాచారులు కలిసి పంబలవారు అమ్మవార్లకు సంబరం నిర్వహించారు. అనంతరం ఘటాలతో ఊరేగింపుగా గ్రామవీధుల్లో ఊరేగారు. గ్రామస్తులు అమ్మవార్లకు చల్దిన్నం, బెల్లం సమర్పించారు. గణాచారులు అమ్మవార్లను నెత్తిన పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భీమడోలులోని పలు ప్రాంతాల్లో అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో కొవ్వలి వంతెన


ప్రమాదం అంచున కొవ్వలి వంతెన

దెందులూరు: కొవ్వలి వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి కాల్వపైన దాదాపు 12 గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా 1939 సంవత్సరంలో ఈ వంతెన ప్రారంభించారు. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ఈ వంతెన సేవలందించింది. ప్రస్తుతం వంతెన గోడలు, బ్రిడ్జి కమ్మెలు శిథిలావస్థకు చేరాయి. ఈ వంతెనపై చేపల లోడు లారీలు సైతం వెళుతుండడంతో వంతెన ఏ క్షణాని కూలిపోతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఉన్నతాధికారులు వంతెనను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


1939లో ప్రారంభించిన శిలాఫలకం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో శ్రీ రాట్నాలమ్మ తల్లి

పెదవేగి: రాట్నాలకుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీ రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవారం అమ్మవారికి పూజాటిక్కెట్లపై రూ.32,600, విరాళాల రూపంలో రూ.20,100, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.21,510, వెరశి మొత్తం రూ.74,210 ఆదాయం లభించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు.

చింతలపూడి బొగ్గు నిల్వలను వెలికితీయాలి

చింతలపూడి: చింతలపూడి ప్రాంతంలో ఉన్న బొగ్గు నిల్వలను వెలికితీసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు తొర్లపాటి రాజు కోరారు. చింతలపూడిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6 నుంచి 8 వరకు జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో చింతలపూడి కేంద్రంగా బొగ్గు వెలికితీత కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఏలూరులో మూతపడ్డ జూట్ మిల్లులు స్థానంలో ప్రభుత్వ రంగ పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని తీర్మానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికైన తొర్లపాటి రాజుకు ఆ సంఘ చింతలపూడి నియోజకవర్గ నాయకులు ఖమ్మం ప్రసన్నకుమార్, వడ్డే రామారావు, పండగ శేఖర్, పిట్ట టైని తదితరులు అభినందనలు తెలిపారు.

కాలువ పూడిక తొలగింపు చేపట్టాలి

- నీరు పారక ఎండిపోతున్న కృష్ణా కాలువ
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన గుర్రపు డెక్క
- పంట బోదెను తలపిస్తున్న కాలువ
- ఇదీ ఏలూరు కృష్ణా కాలువ పరిస్థితి


ఏలూరు రైల్వేస్టేషన్ ప్రాంతంలో నీరు లేక పూర్తిగా ఎండిపోయిన కృష్ణా కాలువ

ఏలూరు (టూటౌన్): పూర్తి స్థాయిలో నీరు పారక, పారే అవకాశం ఉన్నా పేరుకుపోయిన గుర్రపు డెక్క, వ్యర్థాలు వెరసి కృష్ణా ప్రధాన కాలువ కాస్తా పంట బోదెను తలపిస్తోంది. దీంతో కాలువ పలు చోట్ల పూర్తిగా ఎండిపోయి కన్పిస్తుంది. ఇప్పటికే కృష్ణా కెనాల్ ఆయకట్టు పరిధిలోని రైతులకు పూర్తి స్థాయిలో సాగు, తాగు నీరందక అవస్థలు పడుతున్నారు. కృష్ణా కాలువలో కనీసం పూడిక పనులు చేపట్టక పోవడంతో గుర్రపుడెక్క విపరీతంగా పేరుకుపోయింది. పూర్తి స్థాయిలో వ్యర్థాలతో నిండిపోయి సాగు నీరు కిందకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో దీని ఆయకట్టు రైతులు పూర్తిగా వర్షంపైనే ఆధారపడి సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీసం వచ్చే వేసవిలోనైనా ఏలూరు నగర పరిధిలో కృష్ణా కాలువను ప్రక్షాళన చేసే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగు నీరందక రైతుల ఇబ్బందులు

కృష్ణా కాలువ నీటి ద్వారా దెందులూరు నియోజకవర్గం పరిధిలోని పెదపాడు, ఏలూరురూరల్, దెందులూరు మండలంలో కొంతమేర పంట పొలాలు సాగవుతున్నాయి. కృష్ణా కాలువ నీరు అందకపోడంతో దెందులూరు మండలంలో ఆయకట్టు రైతులు గోదావరి నీటిని ఇంజన్ల ద్వారా తోడుకోవడం లేదా చెరువుల నీటితో సాగు చేసే ప్రయత్నం చేస్తున్నారు. పెదపాడు మండల రైతులు కొద్దిపాటి కృష్ణా జలాలతో పాటు వర్షం నీటి ఆధారంగా సాగు చేస్తున్నారు. దీనికి భిన్నంగా ఏలూరు రూరల్ రైతుల పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి జలాలను పోణంగి పుంత ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేసినా పూర్తి స్థాయిలో అందడం లేదనేది రైతుల వాదన. దీంతో ఏలూరు రూరల్ మండల రైతులకు కృష్ణా కాలువ ద్వారా వచ్చే సాగునీరే ఆధారంగా ఉంది. ఈ క్రమంలో సాగు, తాగు నీరు అందించే కృష్ణా కాలువ పూడుకుపోవడంతో పారే కొద్దిపాటి నీరు కూడా రావడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.